మిన్నంటిన సంబరం.. కదిలిన భక్తజనం

- వైభవోపేతంగా ప్రారంభమైన కోడూరు గంగ జాతర
- అమ్మవారి దర్శనార్థం వేలాదిగా తరలివచ్చిన ప్రజలు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు ప్రజల కొంగుబంగారంగా 100 ఏళ్లగా విరాజిల్లుతున్న కోడూరు గంగమ్మ జాతర గురువారం రంగరంగ వైభవంగా నిర్వహించారు. దశాబ్దాల చరిత్ర కలిగిన ఇక్కడి జాతరకు చుట్టుపక్కల జిల్లాల నుంచి ప్రజలు వేలాది మందిగా గంగమ్మ దర్శనానికి తరలి వచ్చారు. పలువురు ప్రముఖులు వచ్చి గంగమ్మను దర్శించుకొని మొక్కులు తీర్చుకొన్నారు. అలాగే భక్తులు గంగమ్మ దర్శనానికి వచ్చిన ప్రజలకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఎండల నుంచి ఉపశమనం పొందడానికి పలువురు భక్తులకు మజ్జిగను అందజేశారు. కోడూరు పట్టణమంతా ప్రత్యేక అంగళ్లు, రంగులరాట్నాలు, జనాలతో కిటకిటలాడింది. పాతబజారులో అంతా చలువపందిళ్లతో అలంకరించారు. అన్ని వీధులలో విద్యుత్ అలంకరణ బొమ్మలు, దేవుళ్ల, రాక్షసుల వేషాధరణలు ఆకట్టుకొన్నాయి. భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అర్ధరాత్రి తిరుపతి రోడ్డు నుంచి అమ్మవారిని పూల పల్లకీ ఊరేగింపులో యువకులు వేలాదిగా పాల్గొని అంకాలమ్మ గుడి వరకు డీజేలు, బాణసంచా పేలుళ్ల నడుమ తీసుకొచ్చారు. అనంతరం తెల్లవారుజామున స్థానిక అంకాలమ్మ గుడిలో భక్తి శ్రద్ధలతో గంగమ్మను తయారుచేసి ప్రత్యేక పూజలు, భక్తుల కరతాల ధ్వనుల నడుమ అట్టహాసంగా పల్లకీలో ఊరేగింపుగా గంగమ్మ మిట్టకు తరలించారు. వేడుక చూడడానికి ఇసుక వేస్తే రాలనంతగా జనం హాజరయ్యారు. గంగమ్మ నడిచే దారిలో భక్తులు బలులు అర్పిస్తూ మొక్కులు చెల్లించుకున్నారు. నేడు (శుక్రవారం) ఉదయం అమ్మవారిని నిమజ్జనానికి తరలించనున్నారు. జాతర సందర్భంగా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.


గంగమ్మ రాక కోసం వేచివున్న భక్తులు


గంగమ్మను దర్శించుకుంటున్న భక్తులు


అశేష భక్త జనం నడుమ గంగమ్మ మిట్టకు చేరుతున్న అమ్మవారు


ఆకట్టుకున్న వేషధారణలు, డీజే సౌండ్

క్లుప్తంగా

ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోండి

సుండుపల్లె : ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల పాఠశాలలో 2025 – 26 సంవత్సరానికి సంబంధించి 3వ తరగతి నుంచి 9వ తరగతి వరకు బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి దరఖాస్తులు కోరుచున్నట్లు ప్రిన్సిపల్ వెంకటేశ్వరనాయుడు గురువారం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 1వ తేదీ నుంచి 20వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఆయన తెలిపారు. ఖాళీల కంటే దరఖాస్తులు ఎక్కువగా వచ్చినట్లయితే లాటరీ పద్ధతిలో సీట్లు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. 3వ తరగతి ప్రవేశానికి రిజర్వేషన్ పద్ధతిలో (ఎస్టీ 32, ఎస్సీ 4, బీసీ 2, ఓసీ 1, ఈబీసీ 1) మొత్తం 40 ఖాళీలు ఉన్నట్లు చెప్పారు. ఖాళీలు కేవలం ఎస్టీ అభ్యర్థులకే కేటాయించడం జరుగుతుందని, దరఖాస్తు ఫారాలు పాఠశాలలో అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తి కలిగిన తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలో చేర్పించాల్సిందిగా ఆయన కోరారు.

దళవాయిపల్లి పాఠశాల విద్యార్థికి మొదటి ర్యాంక్


విరాజ్ ఆనంద్

పుల్లంపేట : మండలంలోని దళవాయిపల్లి పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థి విరాజ్ ఆనంద్ ఆదర్శ పాఠశాల ఆరవ తరగతి ప్రవేశ పరీక్షా ఫలితాలలో 100 మార్కులకు 87 మార్కులు రావడంతో మండల టాపర్‌గా నిలిచాడు. దీంతో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు విద్యార్థి విరాజ్ ఆనంద్‌ను అభినందించారు.

వైభవంగా శెట్టిగుంట జాతర


పూజలందుకుంటున్న బలిజపల్లి గంగమ్మ

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలంలోని శెట్టిగుంట గ్రామంలో గురువారం వైభవంగా గంగమ్మ జాతరను ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పలు పార్టీల నాయకులు, ప్రముఖులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకొన్నారు. సంప్రదాయబద్ధంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు గంగమ్మకు పొంగుబాలు పొంగించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

అన్నం పరబ్రహ్మ స్వరూపం


యాచకులకు ఆహార పొట్లాలు అందిస్తున్న మానవత సభ్యులు

రాయచోటి టౌన్ : అన్నం పరబ్రహ్మ స్వరూపమని ప్రముఖ వైద్యులు డాక్టర్ బయారెడ్డి అన్నారు. గురువారం రాయచోటి పట్టణంలో రాయచోటి మానవత సంస్థ వారి ఆధ్వర్యంలో దాతలు కొయ్యల వీరయ్య, ఆయన అల్లుడు టేకూరి నాగార్జున ఆర్థిక సౌజన్యంతో యాచకులకు, పాదచారులకు ఆహార పొట్లాలు అందించారు. ఈ కార్యక్రమంలో మానవత సేవా సంస్థ కన్వీనర్ వెంకట్రామిరెడ్డి, ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు బ్రహ్మానందరెడ్డి, కో చైర్మన్ షకీల్, డైరెక్టర్ బోజనపు శివరాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మానసిక వికాసానికి గ్రంథాలయాలు దోహదం


విద్యార్థులకు స్పోకన్ ఇంగ్లిష్ నేర్పిస్తున్న ఉపాధ్యాయుడు

సిద్దవటం : విద్యార్థుల మానసిక వికాసానికి గ్రంథాలయాలు ఎంతగానో తోడ్పడతాయని గ్రంథాలయాధికారిణి లక్ష్మీనారాయణమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గురువారం గ్రంథాలయంలో ఉపాధ్యాయుడు శ్రీహరిసాయి విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్, కథలు చెప్పించడం, పుస్తక పఠనం చేయించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు క్రిష్ణ మాట్లాడుతూ గ్రంథాలయానికి రావడం వలన కలిగే ప్రయోజనాల గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులతో ఆటలు ఆడించారు.

రేపు ఆలయ భూముల వేలం

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కందుకూరులోని దేవాదాయ శాఖ భూములను మూడేళ్ల పాటు కౌలుకు దేవదాయశాఖాధికారులు శనివారం బహిరంగ వేలం పాట వేయనున్నారు. ఈ సందర్భంగా దేవదాయ శాఖ ఏవో మునిరాజ, ఆలయ ధర్మకర్త ప్రకాష్‌రావు మాట్లాడుతూ కందుకూరులోని శ్రీ వేదగిరి లక్ష్మి నరసింహస్వామి, శ్రీ పట్టాభి రామాలయాలకు చెందిన మాన్యం భూములను కౌలు కోసం వేలం నిర్వహిస్తామన్నారు. గతంలో కౌలుకు తీసుకుని డబ్బు చెల్లించని రైతులు వేలంలో పాల్గొనరాదని వారు తెలిపారు.

కులగణన చేస్తుండటం హర్షణీయం


మాట్లాడుతున్న బీసీ నేత నాగేశ్వరరావు

రాయచోటి జగదాంబసెంటర్ : కేంద్ర ప్రభుత్వం త్వరలో దేశవ్యాప్తంగా చేపట్టబోయే జాతీయ జనగణనతో పాటు కులగణనను సైతం నిర్వహించాలనుకోవడం హర్షించదగ్గ విషయమని అన్నమయ్య జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు నాగేశ్వరరావు, గౌరవ సలహాదారు దువ్వూరి నరసింహాచారిలు తెలిపారు. గురువారం రాయచోటిలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మన దేశంలో జనాభా లెక్కల సేకరణ బ్రిటిష్ పాలనలో 1881లో మొదలైందన్నారు. అప్పటి నుంచి ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి దేశవ్యాప్తంగా ప్రభుత్వం ఇంటింటికి వెళ్లి జనాభా లెక్కలను సేకరిస్తున్నారని చెప్పారు. కులగణన బీసీలకు జరగలేదని ఎస్సీ, ఎస్టీలకు మాత్రమే కులగణన చేస్తూ వస్తున్నారన్నారు. బీసీ సంఘాల పోరాట ఫలితమే కేంద్ర ప్రభుత్వం కులగణనను చేపడతామనడం సంతోషకరమైన విషయమన్నారు. కార్యక్రమంలో యువజన సంఘం పాలగిరి హబీబుల్లా, రాయచోటి నియోజకవర్గ అధ్యక్షులు సంచుల ఖాదర్‌బాషా, తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఏకీలను బీసీలో చేర్చిన ఘనత వైఎస్‌ఆర్‌దే


పాళెంగడ్డ పాపన్నగారిపల్లె ప్రజలతో మమేకమైన మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

సంబేపల్లె : ఏకీల కులస్తులను బీసీలో చేర్చిన ఘనత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని శెట్టిపల్లె గ్రామం పాళెంగడ్డ పాపన్నగారిపల్లెలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, గోర్ల రమేశ్ కుమార్‌రెడ్డి, అనిరుథ్‌రెడ్డిలతో కలసి శ్రీకాంత్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వైఎస్‌ఆర్ ప్రభుత్వం హయాంలో బడుగు, బలహీన వర్గాలకు పెద్దపీట వేశారన్నారు. బీసీలంటే బ్యాక్‌వర్డ్ క్యాస్ట్ కాదు బ్యాక్‌బోన్ అని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరూపించారన్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల వలన కరువు ఏర్పడిందని, వ్యవసాయ పనులు, కూలీ పనులు సైతం దొరక్క ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. జగన్ హయాంలో రైతులు సాగు చేసిన పంటలు నష్టపోతే ఆ సీజన్ ముగిసే సమయానికి పరిహారం అందేదని తెలిపారు. అనంతరం మహేశ్‌నాయుడు ఇచ్చిన విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నాగిరెడ్డి, న్యాయవాది శ్రీనివాసులరెడ్డి, ఆనంద్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, కిషోర్‌కుమార్‌రెడ్డి, నరసింహారెడ్డి, ఉమామహేశ్వరనాయుడు, వెంకట్రాదినాయుడు, నాగయ్యనాయుడు, శంకర్‌నాయుడు, కొండయ్యనాయుడు తదితరలు పాల్గొన్నారు.

ఘాట్‌రోడ్డులో రక్షణ గోడ నిర్మాణానికి చర్యలు

ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి

రాజంపేట టౌన్ : ప్రమాదకరంగా ఉన్న రోళ్లమడుగు ఘాట్ రోడ్డులో రక్షణ గోడ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి తెలిపారు. రోళ్లమడుగు గ్రామానికి వెళ్లే మార్గంలో రక్షణ గోడ లేక పోవడంతో తరచూ ప్రమాదాలు జరిగి ప్రజలు మృత్యువాత పడుతున్నారు. దీంతో ఆ గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు బుర్రు సురేంద్రయాదవ్ ఆధ్వర్యంలో రోళ్లమడుగు ప్రజలు ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి ద్వారా సమస్యను గురువారం ఎంపీకి తెలియచేశారు. ఈసందర్భంగా ఎంపీ రక్షణ గోడ నిర్మాణానికి సంబంధించిన అంచనాలు తయారు చేయించాలని ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డికి సూచించారు. సమస్యను తాను జిల్లా కలెక్టర్, సంబంధితశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని ఎంపీ వారికి హామీ ఇచ్చారు. ఇటీవల కాలంలో తరచూ రోళ్లమడుగు ఘాట్‌లో వాహనాలు లోయలోకి పడి ప్రజలు మృతి చెందుతున్నా అధికారులు పట్టించుకోక పోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.


రోళ్లమడుగు ఘాట్ రోడ్డు సమస్యను ఎంపీ మిథున్‌రెడ్డికి వివరిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి

వైభవంగా పత్రపల్లి గంగమ్మ జాతర

ఒంటిమిట్ట : మండల పరిధిలోని చింతరాజుపల్లి పంచాయతీ పత్రపల్లి గ్రామంలో వెలసిన గంగమ్మ జాతర గురువారం ఆలయ కమిటీ సభ్యులు వైభవంగా నిర్వహించారు. ఈ జాతరకు ముఖ్య అతిథులుగా రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, కోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా జాతరకు విచ్చేసిన నాయకులకు రాసా నడిపయ్య నాయుడు, రాసాల నాయుడు వారి కుటుంబ సభ్యులు బాణసంచా పేల్చి పూల వర్షంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం రాసాల కుటుంబ సభ్యులు ఇచ్చిన విందులో వారు పాల్గొన్నారు. పత్రపల్లి గంగమ్మ జాతరలో మహిళా భక్తులు బోనాలు సమర్పించి, బలులు రూపంలో మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, ఒంటిమిట్ట వైఎస్సార్ సిపి మండల కన్వీనర్ టక్కోలు శివారెడ్డి, శివారెడ్డి, రాజంపేట నియోజకవర్గం వైఎస్సార్ సిపి యూత్ వింగ్ అధ్యక్షుడు కూండ్ల ఓబుల్ రెడ్డి, రాసాల జయచంద్ర నాయుడు, రాసాల కదిరయ్య నాయుడు, రాసాల చైతన్య నాయుడు, రాసాల కదిరి ప్రసాద్ నాయుడు, కొటిక రాజమోహన్ నాయుడు, జంగాల శివశంకర్, మనోహర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మకు పూజలు చేసిన మేడా

మండల పరిధిలోని చింతరాజుపల్లి పంచాయతీ, పత్రపల్లి గ్రామంలో వెలసిన గంగమ్మతల్లి జాతరకు విచ్చేసిన రాజంపేట మాజీ ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆయనకు పత్రపల్లికి చెందిన బొడ్డే వెంకటరమణ ఘనస్వాగతం పలికారు. అనంతరం రమణ ఇచ్చిన విందుకు హాజరయ్యారు.


ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటికి ఘన స్వాగతం పలుకుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఆశ, శ్వాస యువతే

రాయచోటి : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఆశ, శ్వాస యువతేనని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి అన్నారు. గురువారం రాయచోటి పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శ్రీకాంత్ రెడ్డిని పట్టణంలోని కొత్తపేట, రామాపురం, సరస్వతీ నగర్, దూదేకులపల్లి, ఓం శాంతి నగర్ బోర్డు ప్రాంతాలకు చెందిన యువత పెద్ద సంఖ్యలో శ్రీకాంత్ రెడ్డిని కలసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి తోడుగా ఉంటామని స్పష్టం చేశారు. రాయచోటిలో శ్రీకాంత్ రెడ్డి చేసిన అభివృద్ధిని యువత గుర్తుచేసుకున్నారు. పట్టణంలో శాశ్వత తాగునీటి సమస్యను తీర్చారని, రింగ్ రోడ్డు, జిల్లా కేంద్రం ఏర్పాటు, వంద పడకల ఆసుపత్రి, ఆర్టీసీ బస్టాండ్ విస్తరణ, మున్సిపల్ సభా భవనం, ఎంపీడీఓ కార్యాలయం, రైతు బజార్ తదితర అభివృద్ధి పనులు చేశారన్నారు. ముఖ్యంగా రాయచోటి పట్టణంలో శాంతి పూర్వకంగా ఎటువంటి వివాదాలు లేకుండా అభివృద్ధి పట్టణ రూపురేఖలను శ్రీకాంత్ రెడ్డి మార్చారని, అటువంటి పాలన అందించిన శ్రీకాంత్ రెడ్డికి మద్దతుగా తాము నిలుస్తామంటూ స్పష్టం చేశారు.

శాస్త్రీయ సాగు పద్ధతులపై అవగాహన ఉండాలి

సిద్దవటం : మండలంలోని జ్యోతి గ్రామ రైతులకు తిరుపతి శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల విద్యార్థినులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గురువారం వారు మాట్లాడుతూ గ్రామీణ అవగాహన కృషి అనుభవ పథకం (ఆర్‌ఏడబ్ల్యూఈపీ) కింద మట్టి సేకరణ ప్రక్రియను రైతులకు ప్రత్యక్షంగా చూపించి, దాని అవసరం ప్రయోజనాలను రైతులకు వివరించామన్నారు. విద్యార్థినులు ముందుగా పొలాల్లో వివిధ ప్రదేశాల నుంచి 15 – 20 సెంటీమీటర్ల లోతులో మట్టిని సేకరించామన్నారు. మొత్తం 8 – 10 ప్రదేశాల్లో నుంచి మట్టిని తీసుకొని మట్టిని సంచిపై పరచి రాళ్లను తొలగించి, సుమారు 500 గ్రాముల మట్టిని నమూనాగా తీసుకున్నామన్నారు. ఈ నమూనాలను ప్రయోగశాలలో పరీక్షించి మట్టిలోని పోషకాలు, పీహెచ్ స్థాయి, తేమ శాతం వంటి విషయాలను తెలుసుకోవచ్చునని చెప్పారు. మట్టి పరీక్ష ద్వారా రైతులకు సరైన ఎరువులు వేసుకోవచ్చునని, ఇది ఖర్చు తగ్గించడంతో పాటు దిగుబడిని పెంచుతుందని విద్యార్థులు వివరించారు.


మట్టి నమూనాలను సేకరిస్తున్న విద్యార్థినులు

పింఛన్ పంపిణీ

వీరబల్లి : నూతనంగా మంజూరైన వితంతు పింఛన్లను మట్లి గ్రామ సర్పంచ్ సోమారపు నాగార్జునాచారి ఆధ్వర్యంలో గురువారం సచివాలయ ఉద్యోగులు కలసి పంపిణీ చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో సమస్యల పరిష్కారానికి, సంక్షేమ పథకాలు అందజేసేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. అలానే అందరి సహకారంతో గ్రామాభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ రాయుడు, అగ్రికల్చర్ అసిస్టెంట్ శ్రీధర్, మహిళా కానిస్టేబుల్ రమ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

నివాళి

రామాపురం : మండలంలోని హసనాపురం గ్రామం వడ్డెపల్లెకు చెందిన సదిపిరాళ్ల విశ్వనాథరెడ్డి గురువారం దశ దిన ఖర్మ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయనతోపాటు ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రాజారెడ్డి, కృష్ణారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, నాగార్జున, నాగబసిరెడ్డి, రామాంజులు, చంద్ర, చిన్నరామ్ తదితరులు పాల్గొన్నారు.

అమరావతి అభివృద్ధి పేరుతో ప్రజాధనం వృథా

రాయచోటి అర్బన్ : రాజధాని అమరావతి అభివృద్ధి పేరుతో చంద్రబాబు ప్రభుత్వం కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని వృథా చేయడం తగదని జిల్లా డీసీసీ అధ్యక్షుడు గాజుల భాస్కర్ అన్నారు. గురువారం పట్టణంలోని జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తగిన ఆదాయ వనరులు లేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో చంద్రబాబు అభివృద్ధి పేరుతో మరింతగా అప్పులు చేస్తూ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో కూరుకుపోయేలా చేస్తున్నారన్నారు.

గతంలో ప్రధాని నరేంద్రమోడీతో రాజధాని అమరావతి నిర్మాణానికి అట్టహాసంగా శంకుస్థాపన చేయించి తర్వాత గాలికి వదలేశారన్నారు. నేడు మరోమారు ప్రధాని చేతులమీదుగా అభివృద్ధి పనుల శంకుస్థాపన పేరుతో కోట్లాది రూపాయలను వృథాగా ఖర్చు చేస్తుండడాన్ని ఖండించారు. రాష్ట్రానికి జీవనాధారమైన పోలవరం ప్రాజెక్టును త్వరగా పూర్తి చేసి వ్యవసాయాభివృద్ధికి పాటుపడాలన్నారు. విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేయకుండా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలంటూ కోరారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కాంగ్రెస్ నేతలపై అవాకులు, చవాకులు పేలడం మానుకోవాలన్నారు. ఆయన మాటలు రాజకీయ పరిపక్వత లేకుండా పోతున్నాయని ఎద్దేవా చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మన్సూర్ అలీఖాన్, ఉపాధ్యక్షుడు ఖదీర్, ప్రధాన కార్యదర్శి అమీర్‌బాషా, కార్యదర్శి రఫీక్, సుండుపల్లె మండల ఇన్‌చార్జ్ సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు గాజుల భాస్కర్

ఎరుపెక్కిన పట్టణాలు

మేడే సందర్భంగా పట్టణాల ఎరుపు రంగును సంతరించుకున్నాయి. వాడవాడలు ఎర్ర జెండాలను కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు ఎగురవేశారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ కార్మికుల త్యాగ ఫలితమే నేడు మనం జరుపుకుంటున్న మే డే అన్నారు. కార్మికుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలపై పోరాటలతోనే ఎదుర్కొందామని పిలుపునిచ్చారు. లేబర్ కోడ్‌ను రద్దు చేసే వరకు ఉద్యమం ఆగదన్నారు. ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణల నుంచి ప్రభుత్వ సంస్థలను కాపాడటమే ధ్యేయంగా పని చేస్తామని పేర్కొన్నారు. మే డే స్ఫూర్తితో లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా మే 20న దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు జరుపుతున్న సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కాగా రాయచోటిలో సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీలో కార్మికులు కోలాటం ఆడుతూ నృత్యాలు చేస్తూ పురవీధులలో ముందుకు సాగారు.

– సాక్షి, నెట్‌వర్క్


రాయచోటి అర్బన్: బస్టాండు సర్కిల్‌లో కోలాటాలు, నృత్యాలతో సాగుతున్న మేడే వేడుకలు


ఒంటిమిట్ట: జెండాను ఎగురవేస్తున్న సీఐటీయూ నాయకులు


సిద్దవటం: మండల కేంద్రంలో జెండా ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు


రాయచోటి అర్బన్: జెండా ఆవిష్కరణలో పాల్గొన్న ఏఐటీయూసీ నేతలు, కార్మికులు


సంబేపల్లె: మండల కేంద్రంలో మే డే వేడుకల్లో మహిళా కార్మికులు


చిట్వేలి: జెండా ఎగురవేస్తున్న సీఐటీయూ నాయకులు


ఓబులవారిపల్లె: మంగంపేట ఏపీఎండీసీ కార్యాలయ ప్రాంగణంలో..


రైల్వేకోడూరు అర్బన్: జెండా ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు


రాజంపేట టౌన్: పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకురాలు మిర్యాల సురేఖ


రాజంపేట రూరల్: ర్యాలీ నిర్వహిస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రతినిధులు, కార్మికులు